INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(2), January :2021
Online Copy Available: www.ijmer.in

# నీతి చంద్రిక – నీతి సూక్తులు

డా॥ గరికపాటి హరిబాబు
అసిస్టెంట్ ప్రొఫెసర్
యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా

"విశ్వ సౌభాగ్యానికి విద్య పట్టుకొమ్మ" విలువలతో కూడిన విద్యా విధానం ద్వారా నైతిక విలువలు, మానవ సంబంధాలు, సామాజిక బాధ్యతలు బలపడతాయి. విలువలు కొరవడిన విద్యా విధానాల వల్లనే నేటి సామాజిక దుచ్ఛర్యలు జరుగుతున్నాయి. సనాతన ధర్మాలకు నిలయంగా, వేదభూమిగా చెప్పుకునే భారతదేశంలో స్త్రీలపై జరుగుచున్న అరాచకాలే నిలువెత్తు సాక్ష్యంగా! నేటి సామాజిక జీవన వ్యవస్థను చిత్రీకరిస్తున్నాయి. విద్య అనేది వ్యక్తి, కుటుంబం, సమాజం, ఆర్ధికంగా అభివృద్ధి చెందటానికి ఉపకరించే సాధనం మాత్రమే! అన్నధోరణిలో నడుస్తుంది నేటి మానవలోకం. "విద్య అంటే!" నీతి, నిజాయితి, సత్యం, న్యాయం, ధర్మం, దయ, విచక్షణ" అను లక్ష్య లక్షణ సూత్రాలను సాధించే ఆయుధంగా భావించినపుడే "విశ్వ సౌభాగ్యానికి విద్య పట్టు కొమ్మ" అను సూక్తి పరిపుష్టి అవుతుంది.

సమాజంలో నైతిక విలువలు, మానవ సంబంధాలు నశించటానికి కారణం నేటి విద్యా విధానమే, నూతన విద్యా విధానాల వల్ల సృజానాత్మకత పెరుగుతుంది. తద్వారా నూతనావిష్కరణలు జరుగుతున్నాయి. నూతన ధోరణలు కొనసాగుతున్నాయి. నూతన జీవన విధానాలు వస్తున్నాయి. కాని నైతికత నశించిన నరసమాజం-రాక్షస సమాజం అవుతుంది. రాక్షస సమాజంలో ఆచ్చర్యాలే కాని, ఆనందాలు ఉండవు. ఆనందం లేని జీవితం వృధా, ఆనందకరమైన జీవనాన్ని అందించే సమాజం గొప్ప సమాజం అవుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచే పాఠ్యాంశాలతోపాటు విలువలు పెంచే సూక్తులతో కూడిన పాఠ్యాంశాలను నిర్ణయించటం చాలా అవసరం.

విద్యార్థులు చెడు మార్గాల్లో పయనించడానికి ప్రధాన కారణం స్నేహం, చెడు స్నేహాలవల్ల యువత పాడైపోతున్నారు. స్నేహం ఎలాంటి వారితో చేయాలి, ఎలాంటి వారితో చేయకూడదు అనే విచక్షణ యువతకులేదు. పూర్వకాలంలో "పరవస్తు చిన్నయ సూరిగారు" రాసిన మిత్రలాభం, మిత్రభేదం, సంధి, పాఠ్యాంశాల ద్వారా జీవితానికి సరిపడా జ్ఞానాన్ని పొంది, వివేచనతో

కూడిన జీవితాన్ని గడిపేవారు. నీతిచంద్రిక కావ్యాన్ని చదవటం విద్యార్థులకు చాలా అవసరం. నీతి చంద్రికలో నైతిక విలువలు పెంపొందించే అనేక విషయాలను, సూక్తులను, మిత్రలాభం, మిత్రభేదం, పాఠ్యాంశాలలో చిన్నయ సూరిగారు పొందుపరిచారు.

**1. సూక్తి :- "ఎవ్వడు బుద్ధిమంతుడో వాడు వృద్ధుడుగాని, యేండ్లు మీరినవాడా వృద్ధుడు"?**

**భావం :-** వయసు పెరిగినంత మాత్రాన పెద్దవాడు కాదు. విచక్షణా జ్ఞానం కలిగినవాడు పెద్దవాడు.

ఇది మిత్రలాభంలోని కథ. వేటగాడు పావురాలను పట్టడానికి నిర్జన ప్రదేశంలో నూకలు చల్లి వల పన్నుతాడు. ఇలాంటిచోట నూకలు ఉన్నాయంటే, ఇందులో ఏదో ప్రమాదం ఉందని పావురాల నాయకుడు చిత్రగ్రీవుడు చెప్పినా వినకుండా మిగిలిన పావురాలు ఒక ముసలి పావురం మాటలు విని ఆ నూకలు కోసం ఆశపడి వలలో చిక్కుకుంటాయి, కావున ప్రమాదాలనుండి తప్పుకోవడానికి బుద్ధి, జ్ఞానం కావాలిగాని, పెద్ద వయసు కాదు అని అర్థం. వయసు చిన్నదైనా జ్ఞానవంతుని మాటలు వినాలి.

**2. సూక్తి :- "గుణవంతులలో ప్రథమగణ్యుడు గాని కొడుకును గన్న తల్లికంటే వేరు గొడ్రాలు గలదా? గుణవంతుడయిన పుత్రుడొకడు చాలును. మూర్ఖులు నూరుగురు వలన ఫలమేమి"?**

**భావం :-** వందమంది గుణవంతులు ఉన్నపుడు వారిలో కూడా అగ్రగణ్యుడుగా ఉండే కొడుకుని కనలేని తల్లి గొడ్రాలుతో సమానం. అగ్రగణ్యుడైన గుణవంతుడు, ఒక్క పుత్రుడు చాలు. చెడ్డవారైన వంద మంది పుత్రులు వలన లాభం లేదు.

పాటలీ పుత్ర నగరాన్ని పాలించే సుదర్శనుడనే రాజు, తన కుమారులు అతి గారాభం వలన, మూర్ఖులై, గర్వంతో, సోమరులుగా కాలం వెళ్ళబుచ్చుతున్న సమయంలో రాజు విచారిస్తాడు. వారికి విద్యాబుద్ధులు చెప్పించి జ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలను కుంటాడు. పుత్రులను గుణవంతులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులదే అని ఆలోచించి మంచి గురువు వద్దకు వారిని పంపుతాడు. రాజు కుమారులు రాజ్యానికి

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(2), January :2021
Online Copy Available: www.ijmer.in

ఆదర్శంగా వుంటే రాజుకి కూడా కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. నీచమైన కొడుకులు వల్ల సమాజానికి నష్టం చేకూరుతుంది.

**3. సూక్తి :- "ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్యశంకితుడు, పరభాగ్యోప జీవియు ననువారారుగురు దుఃఖ బాగులని నీతికోవిదులు చెప్పుదురు".**

**భావం :-** ఎదుటి వారు బాగుంటే చూసి ఓర్వలేనివాడు, రూపంలో అసహ్యంగా ఉండి, చెడుగా మాట్లాడేవాడు, ఎంత ఆస్థి ఉన్నా తృప్తి లేనివాడు, ఎప్పుడూ కోపంతో ఉండేవాడు, ప్రతివారిని, ప్రతి విషయాన్ని అనుమానించేవాడు, తన కష్టార్జితం కాకుండా ఇతరులపై ఆధారపడి జీవించేవాడు, ఈ ఆరుగురు ఆనందం లేకుండా దుఃఖంతో జీవిస్తారు.

ఇది మిత్ర లాభంలోని కథ. పావురాల గుంపు ఆకాశంలో ఎగుతున్నప్పుడు జన సంచారం లేని ప్రాంతంలో నూకలు ఉండటాన్ని ప్రమాదంగా భావించి, వాటికోసం మనం ఆశపడటం మంచిది కాదని పావురాల నాయకుడు చిత్రగ్రీవుడు చెబుతాడు. కాని ముసలి పావురం మాత్రం నోటి దగ్గరకు వచ్చిన ఆహారాన్ని లేని పోని అనుమానాలతో పొగొట్టుకోవటంవల్ల దుఃఖపడతామని చెబుతుంది. లోకంలో ఆరుగురు దుఃఖపరులుంటారని మిగిలిన పావురాలతో చెప్పి, వాటిని అక్కడ మేతకోసం దిగేటట్లుచేసి ప్రమాదంలో చిక్కుకొనడానికి కారణమవుతుంది.

**4. సూక్తి :- "అర్ధపరిహీనునకు నిరంతరము ఖేదము సంభవించును. నిరంతర ఖేదము వలన బుద్ధి హీనత్వము ప్రాప్తించును. బుద్ధి హీనతవలన సమస్త కార్యములు నిదాఘనదీపూరములట్లు వినాశమునొందును. ధనవంతునకే పౌరుషమును, మేధా సంపత్తియు, బంధుమిత్రులును గలుగుదురు".**

**భావం :-** ధనం లేక దరిద్రంతో జీవించే వాడు ఎల్లప్పుడూ దిగులుతో ఉంటాడు. దిగులు వలన జ్ఞానం నశిస్తుంది. జ్ఞానం నశించటం వలన అన్ని పనులు సకాలంలో చేయలేక, వేసవి కాలంలో నీళ్ళు ఎండిపోయినట్లు పనులన్నీ ఆగిపోతాయి. ధనం సంపాదించిన వ్యక్తులకే పౌరుషం ఉంటుంది. తెలివి తేటలు ఉంటాయి. బంధువులు, మిత్రులు ఏర్పడతారు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(2), January :2021
Online Copy Available: www.ijmer.in

మిత్ర లాభం కథలో హిరణ్యకుడనే ఎలుక రాజు ఎంతో కష్టపడి ఆహారాన్ని సంపాదించి, భుజించగా మిగిలిన ఆహారాన్ని కలుగులో దాచుకుంటుంది. ఒకరోజు చూడాకర్ణుడు అనే సన్యాసి వల్ల దాచుకున్న ఆహారాన్ని కోల్పోతుంది. అప్పటి నుండి హిరణ్యకుడునే ఎలుక ఏపనీ చేయలేక దీనస్థితికి చేరుకుంటాడు. దిగులుతో అజ్ఞానిగా జీవిస్తూ కష్టాలు పడుతుంది. మనిషి ఆనందంగా జీవించడానికి కష్టపడి సంపాదించే ధనం ఎంతో దోహదం చేస్తుంది. దారిద్ర్యము మనిషిని చెడుదారుల వైపు నడిపిస్తుంది. సత్యమార్గంలో ధనాన్ని ఆర్జించి, రేపటికోసం జాగ్రత్త పెట్టాలి.

**5. సూక్తి :- "సంసార విష వృక్షమునకు రెండు ఫలము లమృత తుల్యములు. కావ్యామృత రసపాన మొకటి, సజ్జన సంగతి యొకటి".**

**భావం :-** సంసార జీవనం చాలా కష్టాలతో కూడుకొని ఉంటుంది. కష్టభరితమైన కుటుంబ జీవితానికి రెండు అమృత ఫలాలు ఉన్నాయి. ఒకటి మంచి పుస్తకాన్ని చదవటం, రెండవది సజ్జనులతో స్నేహం చేయటం.

మిత్ర లాభం కథలో హిరణ్యకుడనే ఎలుక తను దాచుకున్న ఆహారాన్ని కోల్పోయి దిగులు, దుఃఖంతో జీవించే క్రమంలో తాబేలుతో స్నేహం కుదురుతుంది. దాని స్నేహం వలన అన్ని కష్టాలుపోయి, ఆనందంతో, ఉత్సాహంగా జీవిస్తుంది. మనిషి కష్టాల్లో ఉన్నపుడు బుద్ధి హీనత్వం వస్తుంది కాబట్టి ఒంటరిగా జీవితం గడపకుండా మంచి పుస్తకాలు చదవడం, సజ్జనులైన వ్యక్తులతో స్నేహం చేయటం చాలా మంచిది. మంచి స్నేహితుల వల్ల మనోధైర్యం, ఆశ, ఆనందం కలుగుతాయి. మంచి స్నేహం వల్ల కొత్త జీవితాన్ని పొందవచ్చు.

మనుషులు ఈర్ష్యాద్వేషాలతో, అజ్ఞానంతో, అనుమానాలతో, తృప్తి లేకుండా, వికార రూపాలతో, కోపతాపాలతో, సోమరి తనంతో, గుణహీనంతో, జీవించటం మంచిదికాదు. సంపాదించిన ధనాన్ని పోగొట్టుకున్నా ఆనందం ఉండదు. వైవాహిక జీవితం కష్టాలతో కూడుకొని ఉంటుంది, బానిసగా పనిచేయటం కన్నా కష్టపడి పనిచేసి జీవించటం ఉత్తమమైన విధానం. ఇలాంటి అనేక సూక్తులుతో నిండి ఉన్న చిన్నయ సూరిగారి మిత్రలాభం, మిత్రభేదం అనే వివేచనాత్మక కథా సారాంశాలతో ఉన్న

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(2), January :2021
Online Copy Available: www.ijmer.in

నీతిచంద్రిక కావ్యాన్ని ప్రతీ విద్యార్థీ ప్రాథమికోన్నత స్థాయిలో చదవటం వలన జీవితానికి చెందిన అనేక విషయాలను గ్రహిస్తారు. నీతి, నిజాయితి, నైతిక విలువలు పెంపొందుతాయి. ఇలాంటి సూక్తులతో కూడిన సాహిత్యాంశాలను విద్యార్థులు పఠించటం వలన నైతిక విలువలు పెరిగి, సమాజంలో అకృత్యాలు నశిస్థాయి. శాస్త్ర సాంకేతికతతోపాటు మానవీయ విలువలు నిండినపుడే ఏ దేశమైనా అభ్యుదయ పథంలో ముందుకెళుతుంది.
“ సర్వేజనా సుఖినో భవంతు ”

**ఆధార గ్రంథం :-**

**1) నీతి చంద్రిక - పరవస్తు చిన్నయ సూరి గారు**